క్లుప్తంగా

నేడు నీలానగరంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

వీరఘట్టం: మండలంలోని నీలానగరం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశిబిరంపై గ్రామస్తులకు తెలియజేయాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ధనలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్యారాణి, తదితరులు

గరుగుబిల్లి: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల/పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పోలిశెట్టి ధనలక్ష్మి ఎంపికైయ్యారు. విజయనగరం రాజీవ్ క్రీడా మైదానంలో జిల్లా జట్లును ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ధనలక్ష్మి ఎంపిక కావడంపట్ల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, సిబ్బంది వెంకటరత్నం, భువన అభినందించారు.

ఫ్రెషర్స్ డే సందడి



సాంస్కృతిక కార్యక్రమంలో అభినయిస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: స్థానిక తమ్మినాయుడు విద్యాసంస్థల్లో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థల అధ్యక్షురాలు నారాయణమ్మ మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతర కృషితో ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

పొలం గట్లపై పంటల సాగు



కారివలసలో పొలంగట్లపై వేసిన మినుము

గరుగుబిల్లి: నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకు పెరుగుతుండటంతో రైతులు తమ పొలాల గట్లుపై కూరగాయలు, పెసర, మినుము, కంది తదితర పంటలను సాగువేసి అదనపు ఆదాయంను పొందుతున్నారు. ప్రధాన పంటతో పాటు గట్లపై బీర, చిక్కుడు, బెండ, కంది పంటలను సాగువేసి తమ కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నారు. గరుగుబిల్లి, కారివలస, సుంకి, సన్యాసిరాజుపేట, రావివలస తదితర గ్రామాలలో రైతులు పొలం గట్లపై వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నారు. ఈ పంటల వల్ల ప్రధాన పంటకు ఆశించే తెగుళ్లు కూడా తగ్గుతాయని రైతులంటున్నారు.

గడువులోగా మూడో విడత రీసర్వే పనులు పూర్తి



తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: ప్రభుత్వం అమలు చేసిన జగనన్న భూ 'హక్కు', భూ 'రక్ష' పథకం ద్వారా జరుగుతున్న రీ సర్వే పనులు ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం చినభోగిలి, బూర్జ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెకెండ్ ఫేజ్‌లో జరుగుతున్న పనుల్లో భాగంగా 12 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి స్టోన్ ప్లాంటేషన్ చేసినట్లు తెలిపారు. అలాగే 22ఎ ప్రభుత్వ భూములు, నిషేధిత రిజిస్టర్‌లో నమోదు చేయడం రెండు రోజుల్లో పూర్తవుతుందన్నారు. మూడోవిడత డీఎల్ఆర్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే బుడ్డిపేట, చినభోగిలి గ్రామాల్లో గ్రౌండ్ ట్రూత్ పనులు పూర్తయ్యాయని, రైతులు రీసర్వే పనుల్లో పాల్గొనే వారికి సహకరించాలని కోరారు. రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, మండలసర్వేయర్ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

మన్యంలో పర్యాటకుల సందడి



బోటుషికారు చేస్తున్న పర్యాటకులు



జారుడుబల్లపై చిన్నారులు



బంజీట్రంపోలిన్ చేస్తున్న యువకుడు

సీతంపేట అడ్వంచర్ పార్కులో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు పార్కును సందర్శించారు. ఇక్కడి జలవిహార్‌లో బోటుషికారు చేయడంతో పాటు వివిధ సాహస క్రీడలు ఆడుతూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో సందడిగా గడిపారు. అనంతరం సమీపంలోని మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు.

– సీతంపేట

ఘనంగా కలగొప్పులు



గరుగుబిల్లి: ఉల్లిభద్రలో అమ్మవారికి మొక్కులు తీరుస్తున్న గ్రామస్తులు



జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో మేకపోతును పూజిస్తున్న రైతులు

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర, చిలకాం, శివ్వాం తదితర గ్రామాల్లో కలగొప్పులను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఖరీఫ్‌లో ఉభాలు, కలుపు నివారణ తదితర కార్యక్రమాలు తరువాత వరి పంటలో చీడపీడలు సోకకుండా ఉండేందుకు వీలుగా మేకలు, కోళ్లను బలి ఇచ్చి వరిపంట పొలంలో వేయడం ఆనవాయిగా వస్తోంది. ఈ మేరకు అయా గ్రామాల్లో రైతులు కలుపుగొప్పులను నిర్వహించి ఈ ఏడాది పంటలు బాగా పండాలని అమ్మవారికి వేడుకొంటూ మొక్కులు తీర్చారు.

– **జియ్యమ్మవలస:** మండలంలోని వెంకటరాజపురం, గవరమ్మపేట తదితర గ్రామాలలో ఆదివారం ఉడుపుల కలగొప్పులు ఘనంగా జరుపుకున్నారు. ఉడుపులు పూర్తయిన తరువాత పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఏటా అక్టోబరు నెలలో కలగొప్పులు జరుపుకోవడం ఆనవాయితీ. మేకపోతును పూజించి అమ్మవారికి బలిస్తారు. పొలాల్లో పొలి జల్లి మొక్కుతారు. ఇలా చేస్తే పంట దిగుబడి బాగుంటుందని రైతుల నమ్మకం.

టెండర్ ప్రక్రియ వాయిదా

సీతంపేట: గిరిజన గురుకులాలు, మినీగురుకులాలు, కళాశాలలు, వసతిగృహాలకు కూరగాయలు, పండ్లు, చికెన్ సరఫరా చేయడానికి ఈనెల 9న నిర్వహించాల్సిన టెండర్లను వాయిదా వేసినట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెండర్‌దారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు 11న ఇంటర్వ్యూ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ గెస్ట్ అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. సెట్, స్లెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో ఈ నెల 11న ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు తరగతి గదిలో డెమో ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

విజయవాడకు పయనం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన విజయవాడంలో నిర్వహించే సమావేశానికి నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. పాలకొండ నుంచి వెళ్లే బస్సును ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ జెండాఊపి ప్రారంభించారు. వీరంతా సోమవారం జరిగే సమావేశంలో పాల్గొంటారు.

రూ.40 లక్షలతో రోడ్ల నిర్మాణం



రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మన్మథరావు

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ పరిధిలో ఉన్న గిరిశిఖర గ్రామాలకు రూ.40 లక్షలతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పంచాయతీ పరిధిలోని డుంబుమానుగూడ నుంచి కంబమానుగూడకు, మాలిగాడిగూడ నుంచి తోటపాయిగూడకు, సిరికొండ నుంచి సాలిడంగుడ గూడకు, సంది గూడకు రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. దశాబ్దాలుగా రహదార్లకు నోచుకోని గిరిశిఖర గ్రామాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రోడ్లు నిర్మాణం జరుగుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

పాచిపెంట: మండలంలోని పద్మాపురం పంచాయతీ బడ్నాయకవలస నుంచి పులిగుంటవలస వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, సర్పంచ్ బడ్నాన వీరయ్య ఆదివారం భూమిపూజ చేశారు. సుమారు రెండు కోట్ల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రహదారి నిర్మించనున్నట్లు ఐటీడీఏ జేఈ సత్యనారాయణ తెలిపారు.

వర్షాలు కురవాలని కప్పలకు పెళ్లి



కప్పలకు పెళ్లిచేసి కావిడిలో ఊరేగిస్తున్న గ్రామస్తులు



కొండపైన పూజలు చేస్తున్న నులకజోడు గ్రామస్తులు

భామిని: వరుణ దేవా..కరుణించవా.. అంటూ మండలంలోని నులకజోడులో రైతులు ప్రార్థనలు చేశారు. వర్షాలు కురవాలని కోరుకుంటూ కొండదేవతకు వరద పాయసం పెట్టారు. కప్పలకు పెళ్లి చేసి కావిడలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. తివ్వకొండ మెట్టపైకి తీసుకువెళ్లి మొక్కులు తీర్చారు. వరద పాయసం పోసి పూజలు చేశారు. గ్రామానికి చెందిన రైతులంతా ఊరేగింపులో పాల్గొన్నారు.

వైభవంగా అసిరితల్లి సంబరం



ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

పాలకొండ రూరల్: మండలంలోని సింగన్నవలసలో గ్రామదేవత సంబరాలు ఆదివారం వైభవంగా జరిగాయి. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముందుగా అసిరితల్లి అమ్మవారికి మొక్కులు చెల్లించడం సాంప్రదాయమని గ్రామస్తులు తెలిపారు. పాడిపంటలు బాగుండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ సామూహికంగా ఘటాలతో అమ్మవారికి చల్లదనం చేశారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు



సింగిడి మీదుగా వెళ్తున్న ఇసుక లారీ

భామిని: ఒడిశా నుంచి ఇసుర తరలిస్తున్న లారీలు భామిని మండలం మీదుగా నిరంతరం రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బత్తిలికి ఎగువన ఉన్న ఒడిశా ప్రాంతాల్లోని రాయిగూడ, పొంగలివదర, ఎగువ భామిని ప్రాంతాల నుంచి భారీ లారీలతో ఇసుక తరలిస్తున్నారు. ఇసుక లారీల కారణంగా పలుచోట్లు నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. భారీ లారీల రాకపోకలతో రోడ్లు పాడవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

రైతులంతా ఈకేవైసీ చేయించాలి

సీతానగరం: మండలంలోని రైతులు సాగు చేస్తున్న పంటల గణన, ఉత్పత్తిని గుర్తించడాని కి వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న ఈకేవైసీలో రైతులు సహకరించాలని ఏఓ ఎస్.అవినాష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండలంలోని పెదభోగిలిలో వ్యవసాయశాఖ సహాయకులు చేస్తున్న పనులను పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయాల్సిన గడువు ముగియనుండడంతో రైతులందరూ పొలాల్లో సాగు చేస్తున్న పంటపై ఈకేవైసీ విధిగా చేయించుకోవాలని స్పష్టం చేశారు.

ప్రజలకు వాస్తవాలు తెలియజేయండి..

● ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలకు వివరించి, వాస్తవాలు తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శా ఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో ని తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడి యా కన్వీనర్లతో ఆదివారం సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నిక లు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తూ, బురద చల్లే ప్రయత్నా లు ముమ్మరం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయంలో అందరం అప్రమత్తంగా ఉంటూ, వాటి ని తిప్పికొట్టాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నా రన్నారు. జిల్లాలో అత్యధిక నిధులు, అధిక అభివృద్ధి పనులు జరుగుతున్న నియోజకవర్గం సాలూరేన ని చెప్పారు. ఈ వాస్తవాలన్నింటినీ ప్రజల్లోకి తీసు కువెళ్లాలని సూచించారు. ఎన్నికల ఫీవర్ ప్రారంభమైన నేపథ్యంలో అందరూ మరింత చురుగ్గా పనిచేయాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్ మో హన్‌రెడ్డిను మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

సాగునీటి కోసం పాట్లు



గురండిలో వ్యవసాయ బోరు వద్ద నీటి తరలింపులో రైతులు

భామిని: ఖరీఫ్ వరిసాగు పొట్టదశకు చేరుకుంది. ఈ దశలో పంటకు నీటితడులు అందించినట్లయితే దిగుబడి బాగుంటుంది. అయితే గత కొన్నిరోజులుగా వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. వర్షాల కోసం ఎదురుచూసిన విసిగిపోయిన రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించారు. వ్యవసాయ బోర్లు ద్వారా నీటిని పైపుల సాయంతో శివారు భూములకు తరలిస్తున్నారు. గురండి, బిల్లుమడ, బొమ్మిక, కాత్రగడ-బి, బత్తిలి ప్రాంతాల్లో వ్యవసాయ బోర్లు ద్వారా పంటకు నీటి తడులు అందిస్తున్నారు.

వాహనమిత్రతో ఆటోవాలాకు భరోసా



సీఎం జగన్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

వీరఘట్టం: వాహనమిత్ర పథకంతో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆటోవాలాలకు భరోసా కల్పించారని వీరఘట్టం శ్రీకోటదుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముక్కా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఆదివారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. గత నాలుగేళ్లుగా వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తూ వందలాది మంది ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న సీఎం జగన్మోహనరెడ్డి సాయం మరువలేమన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు గుడివాడ శంకరరావు, పాలకొండ ధర్మ, కె.దుర్గారావు, మామిడి శ్రీను, ఎస్.గంగరాజు, ఆర్.ఆనంద్, రాయిపల్లి దిలీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, అంబళ్ల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన సబ్‌స్టేషన్ ఏర్పాటు



జగనన్న కాలనీలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్

పాలకొండ రూరల్: జగనన్న అర్బన్ కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎస్.శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ కాలనీలో దాదాపు 1300 గృహాలకు విద్యుత్ సరఫరా చేసేలా రూ.3.48 కోట్ల వ్యయంతో 33/11కేవీ సామర్థ్యంతో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ జరుగుతున్న మట్టి, గ్రావెల్ ఫిల్లింగ్, ఫెన్సింగ్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. త్వరలో పనులను పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

కురుపాంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు

కురుపాం: నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, బాకాయి మెస్‌బిల్లులు విడుదల చేయాలని, మెస్‌చార్జీలు పెంచాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండంగి శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజు, హెచ్.సింహాచలం, బి.గంగారావు, కె.భాస్కరరావు డిమాండ్ చేశారు. ఏడు రోజులుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపడుతున్న విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర ఆదివారం కురుపాం చేరుకుంది. స్థానికంగా ఉన్న వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్రకు స్థానిక గిరిజన సంఘం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జె.సరోజా, ఎం.మీనాక్షి, టి.శోభారాణి, ఎస్.వసంతరాణి సంఘీ భావం తెలియజేశారు.

విక్రాంత్‌కు అభినందనల వెల్లువ



విక్రాంత్‌కు అభినందనలు తెలుపుతున్న పార్టీ నాయకులు

పాలకొండ: ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు ప్రభుత్వ విప్‌గా నియమించిన నేపథ్యంలో పలువురు పార్టీ నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు. పాలకొండ, రాజాం నియోజకవర్గాల నుంచి ఆదివారం పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిసి సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



సుదర్శన హోమంలో పాల్గొన్న దంపతులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాకడహారతి, విశేష అర్చనలు, అభిషేకములు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో, అర్చకులు సత్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, పాలకొండ, వీరఘట్టం, పార్వతీపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమి షనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని పేర్కొన్నా రు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వాదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు తెలిపారు. వ్యాపారస్తులు వాటిని విక్రయిస్తే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు. పలుమార్లు పట్టుబడినట్లయితే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.